క్లుప్తంగా

బాధ్యతగా మొక్కల పెంపకం

సీతంపేట: భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో వికాస్ సప్తాహ్‌లో భాగంగా శనివారం ద్వారకా నగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ఎస్.అవధాని మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల ప్రాణవాయువును పొందడమే కాక, కాలుష్యాన్ని నివారించ గలుగుతామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వృక్షాలుగా మలచాలన్నారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు ఎం.వి.రాజశేఖర్, రమేష్ చంద్‌జైన్, ఎం.వి.వి.సత్యనారాయణ, పంపాన వెంకటేశ్వరరావు, సత్యశ్రీ, లక్ష్మీనారాయణ, రఘువీర్ పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థితో రౌండ్ టేబుల్, రోటరీ సంస్థల ప్రతినిధులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా, రోటరీ బ్లడ్ బ్యాంకు సంయుక్తంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. డిగ్రీ, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. కార్యక్రమానికి షిఫ్ట్‌వేవ్ టెక్నాలజీస్ సంస్థ సహకారం అందించింది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. సామాజిక బాధ్యతగా ప్రతి విద్యార్థి ఆరు నెలలకు ఒకసారైనా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మధు, రౌండ్ టేబుల్, లేడీస్ సర్కిల్ ఇండియా, రోటరీ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రం


కార్యాలయ ఆవరణలో చెత్త తొలగిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సిబ్బంది

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మనం ఉన్న చోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వాటి బాధ్యత స్వయంగా మనమే తీసుకుని సంరక్షించాలని ఆయన సూచించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


నృత్య ప్రదర్శనలో చిన్నారి కళాకారిణులు

ఎంవీపీకాలనీ: శ్రీసాయి నటరాజ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు అలరించాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నిజ శ్రావణ మాస వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల చేత ప్రత్యేక నృత్యప్రదర్శనలు నిర్వహించారు. నృత్య అకాడమి ప్రతినిధి ఉషశ్రీ ఆధ్వర్యంలో చిన్నారి కళాకారిణులు లక్ష్మీవరీణ్య, భవిత, ఆరాధ్య, రుషిత, నైనిక, శ్రేయ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి పుష్పాంజలి, కలింగ నర్తనం తదితర అంశాలను అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనం కోసం

అందుబాటులో అధికారులు

కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు


జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జోన్ పరిధి 40 నుంచి నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారుల ఫోన్ నంబర్లకు కాల్‌చేసి తెలియజేయవచ్చు. అవసరమైన పౌర సమాచారం అడిగి తెలుసుకోవచ్చు. జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 పీఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-ఏ డీమ్డ్ పీఐవో(ఇంజినీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవీ(ఇంజినీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
రఘునాథ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి	70932 87310
డాక్టర్ సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	98485 02578
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో(వాటర్ వర్క్స్ విభాగం)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డీప్యూటీ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్ విభాగం)	99123 49448
ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919


రోడ్లను శుభ్రం చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ(ఫైల్)

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి..!

జీవీఎంసీ జోన్-5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. 42 నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించిన పారిశుధ్య సమస్యలు, చెత్త తొలగించపోయినా, గెడ్డలు, కాలువల్లో పూడికలు తీయకపోయినా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించాలని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వారు పట్టించుకోని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జెడ్సీ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్ల సమాచారం

వార్డు	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎస్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	పిహెచ్ మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో రూ.2.85 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కస్తూరినగర్-1లో భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని కె.కె.రాజు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు జరిగే సమయాల్లో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు.

రూ.2.85 కోట్లతో పనులు..

సుమారు రూ.2.85 కోట్ల నిధులతో వార్డులోని కస్తూరినగర్, మధుసూదన్‌నగర్, సూరిబాబునగర్, సంతోష్‌నగర్, సంజీవయ్య కాలనీ కొండవాలు ప్రాంతాల్లో బీటీ రోడ్లు, రిటైనింగ్ వాల్, డ్రైనేజీలు, గెడ్డలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మెట్ల మార్గాలు, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవన పునర్నిర్మాణ పనులు ప్రారంభించినట్లు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు అప్పారావు, ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణి, ఏఈ ఉమా మహేశ్వరరావు, వార్డు నాయకులు కె.చిన్నా, రామారావు, కృష్ణ, నర్సింగరావు, లావణ్య, కృపా, అప్పలరెడ్డి, దుర్గాభవాని, దేవి, విజయ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 24వ వార్డులో ఉత్సాహంగా 'గడపకు గడపకు మన ప్రభుత్వం'


మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 24వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఆయన గాంధీనగర్-2(1086124) సచివాలయం, నక్కవానిపాలెం, ఏఎంజీ హాస్పిటల్ ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్కరూ కె.కె.రాజుకు హారతులతో స్వాగతం పలికారు. ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని స్థానికులకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్నా.. కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. పాలకులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, నాయకులు దల్లి రామకృష్ణారెడ్డి, రఘునాథ్ రెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, జి.రమణమూర్తిరెడ్డి, చంద్రమౌళి రెడ్డి, గుడ్ల చలపతిరెడ్డి, పిలక సీతాకుమారి, సాడి కేశవరెడ్డి, పిడింట్ల పోలిరెడ్డి, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార: నరసింహనగర్‌కు చెందిన సీపీ అవధాని ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి నాగుపాము (స్పెక్టికల్ కోబ్రా) చొరబడింది. వంట గదిలోని పోపుల డబ్బాల మధ్య ఇమిడి ఉన్న ఆ పామును శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో చూసి అవధాని కుటుంబ సభ్యులు భయాందోళనకు లోనయ్యారు. వెంటనే గాజువాకలోని స్నేక్ కిరణ్‌కు సమాచారం అందజేశారు. అతను హుటాహుటిన వచ్చి చాకచక్యంగా నాగుపామును బంధించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్నేక్ కిరణ్ మాట్లాడుతూ పాములు ఇళ్లలో, కార్యాలయాల్లో చొరబడినప్పుడు భయపడకుండా, 88663-68899 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై ఫిర్యాదు

మద్రిపాలెం: తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం రాసవీధికి చెందిన కంచి ఉషా అనే యువతి.. చంద్రమౌళి కళ్యాప్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరిద్దరూ ఓ ప్రైవేటు కాలేజీలో చదువుకున్నారు. ఈ ఏడాది చదువు పూర్తి చేశారు. యువకుడు తనను పెళ్లి చేసుకునేందుకు ఇంట్లో ఒప్పించాడు. తీరా పెళ్లి చేసుకునే సమయానికి కట్నకానుకలు కావాలని పేచీ పెట్టాడు. అవి ఇస్తేనే పెళ్లని.. లేదంటే వేరే సంబంధం చూసుకుంటామని అనడంతో యువతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఉమెన్ ఎస్‌ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

పాలిటెక్నిక్ కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు


విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారి కుమార్

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలు జోరుగా సాగుతున్నాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్), ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న విద్యార్థులకు శుక్రవారం సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు విద్యార్థులు కాలేజీలకు వచ్చి తమ ప్రవేశాలకు సంబంధించిన రిపోర్టును అధికారులకు అందించారు. వారి ధ్రువపత్రాలను అధికారి కుమార్ పరిశీలించారు. పలువురు విద్యార్థులు గైస్ పెట్రోకెమికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ జయప్రకాష్‌రెడ్డికి తమ జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు. ఇందులో భాగంగా వారి ప్రవేశాల పత్రాలను అధికారులు పరిశీలించి కాలేజీలో వారి పేర్లు నమోదు చేసుకున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మెకానికల్ 198, సివిల్ 128, ఎలక్ట్రికల్ 132, మెటలర్జీ 66 సీట్లు పూర్తిగా నిండిపోయాయి. కేవలం సివిల్‌లో 4 సీట్లు మాత్రమే ఈడబ్ల్యూఎస్ కోటాలో ఖాళీగా ఉన్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈడబ్ల్యూఎస్ కోటాలో పెట్రో కెమికల్స్‌లో 3, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్‌లో 3, ఆయిల్ టెక్నాలజీలో 2 సీట్లు మిగిలాయని, ఇవి కూడా రెండో దశ కౌన్సెలింగ్‌లో భర్తీ అవుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఈ నెల 23 నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-2లో గుర్తు తెలియని ఒక వ్యక్తి అనారోగ్యంతో పడి ఉన్నాడు. ఇతడిని గుర్తించిన గవర్నమెంట్ రైల్వే పోలీసులు శనివారం ఉదయం అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి వైద్య సేవలందించారు. చికిత్స పొందుతూ ఈ వ్యక్తి సాయంత్రం మరణించాడు. జీఆర్పీ సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐ మధుసూదన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవని, మృతుడి గురించి తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లోని రైల్వే పోలీసులకు స్వయంగా లేదా 94406 27547, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ సిబ్బంది కోరారు.

'అరుంధతి' సంఘం అధ్యక్షుడిగా ఈతలపాక శ్యామ్‌ప్రసాద్


ఈతలపాక శ్యామ్‌ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు అశోక్‌నగర్ అరుంధతి అభివృద్ధి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఈతలపాక శ్యామ్‌ప్రసాద్(చిన్ని) నియమితుడయ్యారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ గంట్యాడ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ ఈతలపాక వేణుగోపాల్, ఈకేవీ ప్రసాద్, కోశాధికారి గంట్యాడ చక్రపాణి, అడ్వైజర్ పెద్దాడ సత్యనారాయణ, ఎల్లబెల్లి జ్యోతి, ఈతలపాక జ్యోతి, పద్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సులు

ఏయూక్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సుల నిర్వహణ జరగాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు అన్నారు. ఏయూ హిందీ విభాగంలో హిందీ సాహిత్య నిర్మాణంలో మాండలీల భాష రూపాల పాత్ర అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరభారత దేశం నుంచి హిందీ భాష శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో ఆచార్య అర్జున్ పాండే, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షులు ఆచార్య యస్.ఎం ఇక్బాల్, ఆచార్య సీతాలక్ష్మి, ఆచార్య సూరప్పడు, ఆచార్య అరుణ్‌కుమార్ మిశ్ర, సంకల్ప్ సాహితీ సంస్థ అధ్యక్షుడు దినకర్, డాక్టర్ కె.శాంతి, డాక్టర్ ఎస్.కృష్ణబాబులు ప్రసంగించారు. హిందీ కవిసమ్మేళనంలో డాక్టర దీపా గుప్త, సుధా కుమారి జుహి, శివమ్ తివారి, శాంతి మిశ్ర గుంజన్, జయ్ ప్రకాష్‌సింగ్, ఉజ్వల్ గోయల్‌లు తమ కవితలతో రంజింపజేశారు. అతిథులను సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు


సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కలియుగ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

కంచరపాలెం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామ్ ఆచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకరశర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారీ వాహనాల రాకతో ఇక్కట్లు


గురుద్వారాకు వెళ్లే రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు రహదారుల్లో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. టీపీటీ కాలనీలో శనివారం మధ్యాహ్నం భారీ వాహనాలు ప్రయాణించడంతో పలు వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. నిత్యం సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లేఅవుట్, గురుద్వారా తదితర ప్రాంతాల్లో భారీ వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా


మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు డాక్టర్ పీపీ వావా

దాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నేతలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ విజయానికి కృషి


మాట్లాడుతున్న బొడ్డు కల్యాణరావు

సీతంపేట: రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎన్నికలు సమీపిస్తున్నాయని, రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన పార్టీ) ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని, ఆర్‌పీఐ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పార్టీ సత్తా చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ ఉత్తరాంధ్ర నాయకులు కె.గణపతి, బి.గౌతంబాబు, జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, జె.వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.